حسن معاملة رسول الله ﷺ مع غير المسلمين

# ముస్లిమేతర సోదరులతో

# ఇస్లామ్ ప్రవక్త (సఅసం)

# వ్యవహార సరళి


*ఉర్దూ మూలం:*

**మౌలానా ఖాలిద్ సైఫుల్లాహ్ రహ్మానీ**

*తెలుగు అనువాదం:*

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



**అల్ ఫారూఖ్ పబ్లికేషన్స్**

**20/373, మస్తాన్‌వలి స్ట్రీట్, కడప 516 001**

**ఆంధ్రప్రదేశ్, ఇండియా.**

**Cell : 9440708070, 9441403883**

حسن معاملة رسول الله ﷺ مع غير المسلمين

# Muslimetharulatho Islam Pravakta (S) Vaivahara Sarali (Telugu)


Author : **Maulana Khalid Saifullah Rahmani**

Telugu Translation : **Muhammed Azeez-ur-Rahman**



© *All Rights Reserved with Publishers*



**First Edition : December 2016**

**Price : Rs. 20=00**

DTP & Print Supervision : **Al-Baseer Graphics,**
Hyderabad. Cell. 9441055065

Published by : **Al FAROOQ PUBLICATIONS**
**20/373, Mastan Vali Street,**
**Kadapa, A.P., India**
**Cell : 9440708070, 9441403883**
**Email: alfarooqpublications@gmail.com**
**ciwskadapa@gmail.com**
**website: www.ciwskadapa.org**

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

ముస్లిమేతర సోదరులతో సత్సంబంధాలు, సహజీవన భావాలకు సంబంధించి ఇస్లాం రెండు మౌలిక దృక్పథాలను మన ముందుంచింది. ఆ రెండింటిలో మొదటిది: మానవులంతా ఒకే తల్లిదండ్రుల సంతానమనేది.

يَآَيُّهَا النَّاسُ اِنَّا خَلَقْنٰكُمْ مِّنْ ذَكَرٍ وَّاُنْثٰى وَجَعَلْنٰكُمْ شُعُوْبًا وَّقَبَآئِلَ لِتَعَارَفُوْا ۔

**"ప్రజలారా! మేము మిమ్మల్ని అందరినీ ఒకే పురుషుడు ఒకే స్త్రీ ద్వారా పుట్టించాము. మీ పరస్పర పరిచయం కొరకు మాత్రమే మిమ్మల్ని వర్గాలుగా, తెగలుగా విభజించటం జరిగింది."** ***(దివ్యఖుర్ఆన్ - 49 : 13)***

ప్రవక్త మహనీయులు (సఅసం) వివిధ సందర్భాలలో, వివిధ రకాలుగా ఈ విషయాన్ని విడమరచి చెప్పారు. ఉదాహరణకు: ఆయన (స) ఇలా వక్కాణించారు - **كلكم من آدم و آدم من تراب "మీరంతా ఆదమ్ బిడ్డలే. ఆదమ్ మట్టితో చేయ బడ్డారు."** (మజ్మవుజ్జవాయెద్ - హదీసు నెం. 13089).

దైవప్రవక్త (సఅసం) తన వీడ్కోలు హజ్జ్ సందర్భంగా తన ప్రబోధనల సారాన్ని క్లుప్తంగా రెండు ముక్కల్లో ఇలా చెప్పారు: **إن الٰهكم واحد وإن اباكم واحد "నిశ్చయంగా మీ దేవుడు ఒకే దేవుడు. మీ తండ్రి కూడా ఒక్కడే."** (కన్జుల్ అమాల్-హదీసు నెం. 5652)

మానవులంతా ఒకే తల్లిదండ్రుల బిడ్డలన్న భావన రాగానే మానవ సోదర భావం దానంతట అదే జనిస్తుంది - వారు ఏ మతాన్ని నమ్మేవారయినా, ఏ వంశానికి చెందిన వారయినా, వారు తెల్లవారయినా, నల్లవారయినా - వారంతా అన్నదమ్ములే. అందుకే ఆయన (సఅసం) ఒకసారి ఈ విషయాన్ని విశదీకరిస్తూ, "ఆదమ్ సంతతి వారంతా అన్నదమ్ములే" అని నొక్కి వక్కాణించారు (అబూదావూద్, కితాబుల్ విత్ర్ హదీసు నెం. 1510).

ఇక రెండవ దృక్పథం ఇది: మానవుడు మానవత రీత్యా గౌరవనీయుడు, ఆదరణీయుడు. ఈ ప్రపంచంలో ఉన్న లెక్కలేనన్ని వరప్రసాదాలు – అవి నేలపై ఉన్నవైనా, సముద్రంలో ఉన్నవైనా – మానవుల ప్రయోజనార్థమే ఉన్నాయి. అల్లాహ్ సృష్టించిన పరిశుద్ధమయిన ఆహార వస్తువులన్నింటిపై మానవులందరి హక్కు ఉంది. అవి కేవలం ముస్లింలవే లేక మరో మత వర్గం వారివేనన్న విచక్షణ లేదు.

وَلَقَدْ كَرَّمْنَا بَنِيٓ اٰدَمَ وَحَمَلْنٰهُمْ فِي الْبَرِّ وَالْبَحْرِ
وَرَزَقْنٰهُمْ مِّنَ الطَّيِّبٰتِ ۔

**"మేము ఆదమ్ సంతతికి గౌరవం వొసగాము, నేలపైన మాత్రమే గాకుండా నీటిలో కూడా వారికి వాహనాలను ప్రసాదించాము. ఇంకా, వారికి పరిశుద్ధమైన జీవనోపాధిని ప్రసాదించాము."** ***(బనీ ఇస్రాయీల్-70)***

ప్రవక్త మహనీయుల (స) వారు కూడా వివిధ సందర్భాలలో మానవుని మంచి మర్యాద గురించి ప్రస్తావించారు (కన్జుల్ అమాల్–హదీసు నెం. 34621). ఇస్లాం దృష్టిలోనయినా, ఇస్లాం ప్రవక్త (స) దృష్టిలోనయినా సంయుక్తంగా ఉన్న విషయం ఏమంటే; ఒక వ్యక్తి – అతను ముస్లిమయినా లేక ముస్లిమేతరుడయినా – మానవుడైన కారణంగా గౌరవించదగినవాడు, మర్యాద ఇవ్వదగినవాడు. జగతిలో ఉన్న జీవన ఒనరులు కేవలం ముస్లింలవి కావు; మానవులంతా వాటికి హక్కుదారులే.

ఇస్లామీయ దృక్కోణం నుండి ముస్లింల–ముస్లిమేతరుల మధ్య సౌహార్ద సంబంధాలకు పునాది వంటివి ఈ రెండు దృక్పథాలు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన సత్ప్రవర్తన ద్వారా, నియమాల ద్వారా దీనికి సంబంధించిన క్రియాత్మక నమూనాలు సమర్పించారు.

## గౌరవాదరణలు

దైవప్రవక్త (స) ముస్లిమేతర సోదరులను సదా ప్రేమభావంతో పలకరించేవారు. వారితో గౌరవప్రదంగా వ్యవహరించేవారు. ఆయన (స) ఎందరో ముస్లిమేతర చక్రవర్తులకు, నాయకులకు ఉత్తరాలు వ్రాశారు. ఆ ప్రముఖులను అక్కడి ప్రజలు ఏ బిరుదుతో పిలిచేవారో, అదే బిరుదుతో వారిని సంబోధించారు. ఉదాహరణకు: రోము చక్రవర్తి హెరిక్లస్‌ను **'అజీముర్రూమ్'** అని సంబోధించారు. ఈరాన్ చక్రవర్తి

'కిస్రా'ను **'అజీముల్ ఫారస్!'** అని వ్రాశారు. అబిసీనియా రాజు నజాషీని కూడా **'అజీముల్ హబష్!'** అని సంబోధించారు (బుఖారీ). 'అజీమ్' అన్న పదంలో ఘనత వహించినవాడా! మాననీయుడా! అన్న భావాలు ఇమిడి ఉన్నాయి. మక్కాలో అబూ జహల్ ఆయన (స) కు బద్ధ విరోధి. ఆయన్ని వేధించటానికి, కష్టపెట్టడానికి దొరికిన ఏ అవకాశాన్నీ అతను జారవిడిచేవాడు కాడు. అయితే అతనిలో సమస్యలకు సమాధానం వెతికే, వ్యవహారాలపై తీర్పులు ఇచ్చే విశిష్ట సామర్థ్యం ఉండేది. ఈ కారణంగా అక్కడి ప్రజలు అతన్ని 'అబుల్ హకమ్' అని పిలిచేవారు. అందువల్ల దైవప్రవక్త (స) కూడా అతన్ని 'అబుల్ హకమ్' అనే సంబోధించేవారు. (సీరత్ ఇబ్నె హిషామ్ : 1/389).

అబూ సుఫ్యాన్ మక్కావాసుల సర్దారు. అతను (చాలా కాలం వరకు) విశ్వసించలేదు. మక్కా విజయం సందర్భంగా ప్రవక్త మహనీయులు (స) సర్వసామాన్యమైన మన్నింపుల ప్రకటన చేసినప్పుడు, **"తమ తమ ఇండ్లలో ప్రవేశించినవారు సురక్షితంగా ఉంటార"**ని ఆయన పలికారు **من دخل داره فهو امن**. ఆయన (స) గారి ఈ పలుకులో అబూ సుఫ్యాన్ ఇల్లు కూడా ఉంది. కాని అబూ సుఫ్యాన్‌కు గల గౌరవస్థానం దృష్ట్యా అతని గౌరవార్థం ఆయన (స) ప్రత్యేకంగా **من دخل دار ابی سفیان فهو آمن "అబూ సుఫ్యాన్ ఇంట ప్రవేశించిన వారికి రక్షణ ఉంటుంది"** అని ప్రకటించారు (ముస్లిం : కితాబుల్ జిహాద్, హదీసు నెం. 1780).

దైవప్రవక్త (స) మక్కా నుండి వలసపోయే ముందు పవిత్ర కాబా గృహంలో రెండు రకతుల నమాజ్ చేసుకోవాలని కాంక్షించారు. ఆ కాలంలో కాబాగృహం తాళం చెవులు బనూ షైబా తెగ వారివద్ద ఉండేవి. ఆ తెగ ప్రముఖుడైన ఉస్మాన్ బిన్ తల్హా ఆ తాళం చెవులను తన దగ్గర భద్రపరిచేవారు. ఏ వ్యక్తి వద్ద అయినా కాబా గృహం తాళం చెవులున్నాయంటే, అది అతి పెద్ద పురస్కారంగా భావించబడేది. ఎలాగయినా సరే ఆ తాళం చెవులు తమ చేతికి చిక్కాలని ప్రవక్త వంశీయులైన బనూ హాషిమ్ ప్రజలు ఉబలాటపడేవారు. తద్వారా తమ వంశకీర్తికి అది కలికితురాయిగా ఉంటుందని తలపోసేవారు. (మక్కా విజయం సందర్భంగా) బనూహాషిమ్ వంశస్థులైన హ్రజత్ అలీ (రజి), కాబాగృహం తాళం చెవులు తమకు దక్కాలని ప్రగాఢంగా వాంఛించారు. హాజీలకు నీరు త్రాపే గౌరవంతోపాటు, ఆ పవిత్ర గృహం తలుపులు

తెరిచే పురస్కారం కూడా తమకు స్వంతమవ్వాలన్నది బనూ హాషిమ్ అభిలాష. అయితే ప్రవక్త మహనీయులు (స) ఉస్మాన్ బిన్ తల్హాను పిలిపించి, కాబా తాళం చెవులు అతని చేతికిస్తూ, "ఈ రోజు సద్వ్యవహారం చేసే రోజు. ఎవరి అమానతును వారికి స్వాధీనపరిచే రోజు" అని పలికారు. (సీరత్ ఇబ్నె హిషామ్ : 2/412). ఇది అరేబియా సమాజంలో విశిష్ఠ పురస్కారంగా పరిగణించబడేది. ఆ పురస్కారాన్ని ఆయన (స) ఎవరికి ప్రదానం చేశారు? అప్పటికింకా ముస్లిం కూడా కాని వ్యక్తికి! మరి చూడబోతే ఆ వ్యక్తి ఎనిమిదేండ్ల క్రితం కాబా గృహం లోపల రెండు రకతుల నమాజ్ చేసుకునేందుకు కూడా దైవప్రవక్త (స)కు అనుమతివ్వలేదు (అల్ ఖసాయెసుల్ కుబ్రా: 1/446).

ఆయన (స) తన జీవిత కాలంలోనే కాదు, తన మరణానంతరం కూడా ఈ గౌరవ మర్యాదల పరంపర కొనసాగేలా చేశారు. ఆయన ప్రియసహచరులైన హజ్రత్ సహ్ల్ బిన్ హనీఫ్, ఖైస్ బిన్ సాద్ (ర.అన్ హుమ్)లకు సంబంధించిన ఒక సంఘటన– వారిద్దరూ ఖాద్సియా (ఈరాన్‌లోని ఒక ప్రదేశం)లో కూర్చుని ఉండగా, వారి ముందు నుండి ఒక శవయాత్ర సాగిపోయింది. శవాన్ని చూడగానే వారిద్దరూ – మృతుని గౌరవార్థం – లేచి నిలుచున్నారు. 'ఇది ముసల్మానుని శవం కాదు, ముస్లిమేతరుని శవం' అని ఎవరో చెప్పగా, వారిద్దరూ ఇచ్చిన సమాధానమిది: "ఒకసారి దైవ ప్రవక్త (స) ముందు నుండి ఒక శవయాత్ర సాగిపోతుండగా ఆయన (స) కూడా లేచి నిలబడ్డారు. 'ఇది ఒక యూదుని శవయాత్ర కదా!' అని అక్కడున్న వారు ఆయన (స)కు చెప్పగా, 'అయితేనేం? అతను మానవుడు కాదా?' అని ఆయన (స) అన్నారు". (బుఖారీ – కితాబుల్ జనాయెజ్, హదీసు నెం. 125; ముస్లిం కితాబుల్ జనాయెజ్, హదీసు నెం. 961).

ఇదే విధంగా ఆయన (స) పెద్ద వయస్కులను గౌరవించాలని కూడా ఆదేశించారు (తిర్మిజీ – కితాబుల్ బర్ .... హదీసు నెం. 1921).

## ముస్లిమేతరులైన బంధువులతో...

ముస్లిమేతరులైన ముస్లింల బంధువులతో, రక్త సంబంధీకులతో ఉత్తమ రీతిలో వ్యవహరించాలని గట్టిగా తాకీదు చేయబడింది. దివ్యఖుర్ఆన్‌లో పన్నెండు చోట్ల బంధుత్వ సంబంధాలను కాపాడాలని ఆజ్ఞాపించటం జరిగింది.

సమీప బంధువు పట్ల సద్వ్యవహారం చేయటంలో రెండింతల పుణ్యం ఉందనీ, దానం (సదకా) చేసినందుకు, బంధుత్వ హక్కును ఇచ్చినందుకు కూడా (మంచి ప్రతిఫలం లభిస్తుందని) మహనీయ ముహమ్మద్ (స) చెప్పారు (తిర్మిజీ–అన్ సులైమాన్ బిన్ ఆమిర్, హదీసు నెం. 618). “తన జీవనోపాధి వికసించాలని, తనకు దీర్ఘాయుషు ప్రాప్తించాలని కాంక్షించేవాడు బంధుత్వ సంబంధాలను పరిరక్షించాల”ని ఆయన (స) వేరొక సందర్భంలో వక్కాణించారు (బుఖారీ –అన్ అనస్, హదీసు నెం. 991). ఆయన (స) ఇంకా ఇలా ప్రబోధించారు:

“తన పట్ల సద్వ్యవహారం చేస్తే తాను కూడా సద్వ్యవహారం చేస్తానని అనేవాడు వాస్తవానికి బంధుత్వ హక్కును గుర్తించలేదు. తనతో మంచిగా మెలగని బంధువులతో సయితం సద్వ్యవహారం చేసేవాడే నిజానికి బంధుత్వ హక్కును నెరవేర్చాడు (బుఖారీ – అన్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్, హదీసు నెం. 5946).

బంధుత్వ సంబంధానికి ప్రాతిపదిక మతం కాదు, రక్త సంబంధమే. బంధువులు ముస్లింలయినా, ముస్లిమేతరులయినా – వారి పట్ల మంచిగా మెలగాలని ప్రవక్త (స) ఆదేశించారు. అబూ బకర్ కుమార్తె యగు అస్మా (ర.అ) వద్దకు ఒకసారి ఆమె కన్నతల్లి వచ్చింది (మదీనాకు). అప్పటికి ఆమె ఇంకా ముస్లిం కాలేదు. అస్మా గారు దైవ ప్రవక్త (స) సన్నిధికి వచ్చి, ‘ముష్రిక్కు అయిన నా తల్లికి నేనేమైనా ఇవ్వగలనా?’ అని అడిగితే “ఆమె పట్ల ఉత్తమంగా, ఉదారంగా వ్యవహరించు” అని ఆయన (స) ఆజ్ఞాపించారు (బుఖారీ – కితాబుల్ జిజ్‌యా, హదీసు నెం. 3012).

ప్రవక్త సహచరులలో అనేకమంది పరిస్థితి ఎటువంటిదంటే, వారి తల్లి దండ్రుల్లో ఒకరు ముస్లిం అయివుంటే, మరొకరు ముస్లిమేతరులుగా ఉండేవారు. ఉదాహరణకు: మహనీయ అబూబక్ర్ (రజి) గారి తండ్రి మక్కా విజయం వరకూ ముస్లిం కాలేదు. కాని అబూ బక్ర్ (రజి) మాత్రం తన తండ్రి పట్ల సద్భావంతో మెలిగేవారు. హజ్రత్ అబూ హురైరా (రజి) గారి తల్లి ఇస్లాం స్వీకరించలేదు. పైగా ఆవిడ దైవప్రవక్త (స)ను దూషిస్తూ ఉండేది. అయినప్పటికీ ఆమె పట్ల ఉత్తమ రీతిలోనే మెలగమని ఆయన (స) అబూ హురైరాకు ఆదేశించారు. (అద్దుర్రుల్ మన్‌షూర్ : 6/521). సాద్ బిన్ అబీ వక్కాస్ (రజి) గారి తల్లి పరిస్థితి కూడా ఇంతే. అయినాసరే ఆమె యెడల మంచిగానే మెలగాలని ఆయన (స) ఉద్బోధించారు.

మదీనాలోని అనేక మంది అన్సార్ సహాబీలు ముస్లింలు కాని తమ రక్త సంబంధీకులకు ఆర్థిక సహాయం అందిస్తూ ఉండేవారు. ముస్లింలుగా ధర్మపరివర్తన చెందమని వారు తమ బంధువులకు సూచిస్తూ ఉండేవారు. కాని వారు మాత్రం ముస్లింలు కావటానికి సుతరామూ సిద్ధంగా లేరు. అందువల్ల వారు తమ బంధువులకు సహాయం చేయటం నిలిపివేశారు. వారి ఈ ధోరణిని ఖుర్ఆన్ వారించింది (తఫ్సీరె ఖుర్తుబీ : 3/337). వారికి సన్మార్గం లభించటమనేది నీపై ఆధారపడిలేదని, అల్లాహ్ తాను కోరిన వారికి సన్మార్గ భాగ్యం ప్రసాదిస్తాడని చెప్పటం జరిగింది ‘‘ليس عليك هداهم ولكن الله يهدى من يشاء’’ (అల్ బఖరా– 272). ప్రవక్త పెత్తండ్రి అబూ తాలిబ్ ఇస్లాం స్వీకరించలేదు. అయినప్పటికీ ఆయన (సఅసం) తన పెత్తండ్రికి సహాయం చేసేవారు. ఆఖరికి పెత్తండ్రి కుమారుడయిన హ్రజత్ అలీ (రజి) పోషణా బాధ్యతను కూడా ఆయన (స) స్వీకరించారు. ప్రవక్త (స) గారి ప్రేరేపణపైనే అబూ తాలిబ్ గారి మరో కుమారుడు హ్రజత్ అఖీల్ (రజి) పోషణా బాధ్యత వహించడానికి హ్రజత్ అబ్బాస్ (రజి) ముందుకొచ్చారు. మక్కాలో అత్యధిక మందితో ఆయన (స)కు బంధుత్వముండేది. అందువల్ల ఆయన (స) సదా వారి పట్ల సద్భావంతోనే మెలిగేవారు. మక్కాలో తీవ్రమయిన దుర్భిక్షం ఏర్పడినప్పుడు ఆయన (సఅసం) వారికి భారీ ఎత్తున ఆర్థిక సహాయం అందించారు.

## ముస్లిమేతర పొరుగు

బంధుత్వ సంబంధం ముఖ్యమైన సంబంధమైనట్లే ఇరుగుపొరుగు సంబంధం కూడా చాలా ముఖ్యమైనది. దివ్యఖుర్ఆన్‌లో రెండు రకాల పొరుగువారి ప్రస్తావన వచ్చింది. ఒకటి: బంధువులైన పొరుగువారు. రెండు: అపరిచితులైన పొరుగువారు (అంటే బంధుత్వం లేని పొరుగువారు) (అన్ నిసా–36) గా పేర్కొనటం జరిగింది. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలైతే వారిని ‘ముస్లిమేతర పొరుగువారు’ అని పేర్కొన్నారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్– అన్ నిసా సూరా 36వ వాక్యం తఫ్సీర్). కాబట్టి ఈ రెండు రకాల పొరుగువారితో ఉత్తమంగా వ్యవహరించాలని ఆదేశించటం జరిగింది. మహాప్రవక్త (స) గారు ఈ విషయాన్ని మరింత గట్టిగా నొక్కి వక్కాణించారు. “ఎవరి (కీడు)వల్ల పొరుగింటి వానికి రక్షణ లేదో అతను విశ్వాసి కాజాలడు” అని ఆయన ప్రవచించారు. ఈ విషయాన్ని ప్రవక్త (స) మూడుసార్లు ఒట్టేసి మరీ

చెప్పారు (బుఖారీ–కితాబుల్ అదబ్, హదీసు నెం. 5670; హదీసు నెం. 6016). తన ఇంటి గుమ్మానికి మరీ దగ్గరలో ఉన్నవారే పొరుగువారు. ఈ విషయంలో ఆయన (స) ముస్లింలు – ముస్లిమేతరులన్న విచక్షణ పాటించలేదు. దైవ ప్రవక్త (స) వారి ఈ ఉపదేశాల ప్రభావం వల్లనే ఆయన గారి సహాబా ముస్లిమేతరులైన పొరుగువారి పట్ల ప్రేమాదరణలతో మెలిగేవారు. తమ వల్ల వారికెలాంటి భౌతిక నష్టం మానసిక వ్యధ కలగకుండా జాగ్రత్త వహించేవారు. ఒకసారి హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇంట ఒక మేక కోయబడింది. ఆ రోజు ఆయన ఇంటికి రాగానే, 'నా పొరుగు వాడైన ఫలానా యూదు వ్యక్తికి మాంసం పంపారా? లేదా?' అని దర్యాప్తు చేశారు. ఆ తరువాత ఇలా అన్నారు: "ప్రవక్త మహనీయులు (సఅసం) పొరుగువారి యెడల సద్భావంతో మెలగమని గట్టిగా తాకీదు చేసేవారు" (అబూ దావూద్ – అన్ ఇబ్నె ఉమర్, కితాబుల్ అదబ్–బాబు ఫీ హఖ్ఖుల్ జవార్, హదీసు నెం. 5154). ఇరుగు పొరుగు వారిలో ఇంకొక రకం 'తాత్కాలిక పొరుగువారు'. అంటే ప్రయాణంలో ఉన్నప్పుడు ట్రైనులోనో, బస్సులోనో, విమానంలోనో మన ప్రక్కన కూర్చుని ఉండే వారన్నమాట. దివ్యఖుర్ఆన్‌లో ఇలాంటి వారు 'సాహెబుల్ జంబ్'గా పేర్కొనబడ్డారు. అలాంటి వారి యెడల మర్యాదగా మెలగాలని కూడా ఆదేశించటం జరిగింది. ఈ ఆదేశం ముస్లింలు, ముస్లిమేతర సోదరులకు కూడా వర్తిస్తుంది.

## సంతోషంలో, దుఃఖంలో పాల్గొనటం

ఒండొకరి మధ్య సత్సంబంధాలు ఏర్పడాలంటే ఒకరింకొకరి సుఖదుఃఖాలలో పాలుపంచుకోవాలి. దైవప్రవక్త (స) ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకునేవారు. తన ఇరుగు పొరుగువారిలో ఏ ముస్లిమేతర సోదరునికయినా జబ్బు చేస్తే అతని పరామర్శ చేసేవారు. ఒక యూదు నవయువకుడు ఆయన (స) వద్దకు వస్తూ పోతూ ఉండేవాడు. ఆయన పట్ల గల ప్రేమాదరణ వల్ల ఆయనకు సేవలు కూడా చేసేవాడు. అతను వ్యాధిగ్రస్తుడైనప్పుడు దైవప్రవక్త (స) ఆ అబ్బాయి ఇంటికి వెళ్ళి పరామర్శిం చారు (సహీహ్ బుఖారీ – బాబు ఇయాదతుల్ ముష్రిక్, హదీసు నెం. 5657). పరిచ యస్తులైన ముస్లిమేతర సోదరుల అంత్యక్రియలలో కూడా ఆయన (స) పాల్గొన్నారు. అబూ తాలిబ్ మరణించినప్పుడు, ఆయన శవ యాత్రలో పాల్గొనడమేగాకుండా,

ఖనన వాటిక వరకూ వెళ్ళారు (సుననె బైహఖీ – కితాబుల్ జనాయెజ్, హదీసు నెం. 6459). అలాగే ఆయన, ముస్లిమేతరుడైన తండ్రి అబూ తాలిబ్ అంత్యక్రియల ఏర్పాట్లు చేయమని ఆయన కుమారుడైన అలీ (రజి)ని ఆదేశించారు. ప్రవక్త (స) గారి ఈ ప్రబోధనల ప్రభావం ప్రియ సహచరులపై ఎంతగా పడిందంటే, వారు కూడా ముస్లింలుకాని తమ బంధువుల అంత్యక్రియలలో పాల్గొనేవారు.

ముస్లిమేతర సోదరులకు సంతాపం తెలియజేయటానికి, శోకసంతప్త హృదయంతో ఉన్న వారిని ఓదార్చడానికి కూడా ఇస్లాం అనుమతినిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రవక్త (స) గారి స్పష్టమయిన ఆదేశం ఏదీ లేనప్పటికీ, ముస్లిమేతరులతో ఆయన చేసే సద్వ్యవహారాన్ని దృష్టిలో పెట్టుకుని ఇస్లామీయ షరీఅతువేత్తలు, ముస్లిమే తరులకు సంతాపం తెలుపమని బోధించారు.

"రోగులను పరామర్శించండి. రోగులను పరామర్శించేవాడు స్వర్గంలోని ఒక తోటలో ఉంటాడ"ని మహాప్రవక్త (స) ప్రవచించారు (ముస్లిం–బాబు ఫజ్లి ఇయాదతుల్ మరీజ్, హదీసు నెం. 2568). ఈ ప్రబోధనలో ఆయన ముస్లిం–ముస్లిమేతరుడన్న తారతమ్యం చూపలేదు. పరామర్శకు సంబంధించిన ఈ ఆజ్ఞ సర్వసామాన్యమైనది. అలాగే ఆయన కష్టాల్లో ఉన్న వారిని ఓదార్చాలని, వారి ఇబ్బందులను గురించి ఆరా తీయాలని కూడా చెప్పారు "من عزى مصاباً فله مثل اجره" (తిర్మిజీ–కితాబుల్ జనాయెజ్, హదీసు నెం. 1073). ఈ ఓదార్పు విషయంలో కూడా ఆయన (స) మత విచక్షణ పాటించలేదు. అందుచేత ఈ ఆజ్ఞలు అందరికీ సంబంధించినవే – వారు ముస్లింలు గానివ్వండి, ముస్లిమేతరులు గానివ్వండి.

## వాగ్దాన పాలన

నైతిక దృష్టితో ఆయన (స) చేసిన ఆజ్ఞలు సర్వసామాన్యమైనవి. వాటిలో ముస్లి ములు, ముస్లిమేతరులు కూడా చేరి ఉన్నారు. ఉదాహరణకు: – చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాలనేది షరీఅత్ ఆదేశాలలో అత్యంత ముఖ్యమైనది. ఆ వాగ్దానం ముస్లింలకు చేసినదైనా సరే, ముస్లిమేతరులకు చేసి ఉన్నా సరే. దానిని నెరవేర్చటం తప్పనిసరి. ఒకవేళ వాగ్దానానికి విరుద్ధంగా చేస్తే అది పాపం అవుతుంది. ప్రవక్త మహనీయుల (స) వారి జీవితంలో దీనికి సంబంధించిన దృష్టాంతాలెన్నో లభిస్తాయి. వాగ్దానాన్ని

నెరవేర్చటం కష్టమైన సందర్భాలలో కూడా ఆయన వాగ్దానానికి కట్టుబడి ఉన్నారు. వాగ్దానాన్ని పాలిస్తే ముస్లింలకు నష్టం వాటిల్లే అవకాశమున్న పరిస్థితుల్లో కూడా ఆయన (స) వాగ్దాన భంగానికి పాల్పడలేదు. దీనికి సంబంధించిన రెండు దృష్టాంతాలను ప్రస్తావించటం ఇక్కడ సమంజసంగా ఉంటుంది.

బద్ర్ యుద్ధంలో ముస్లింల సంఖ్య మూడు వందల పదమూడు మాత్రమే. కాగా; మక్కా ముష్రిక్కులు వెయ్యిమంది వరకూ ఉన్నారు. అట్టి పరిస్థితిలో ముస్లింల తరఫున ఒక్కొక్క యోధుడు ఎంతో విలువైనవాడే. తీరా యుద్ధం ప్రారంభమయ్యే ముందు హ్రజత్ హుజైఫా బిన్ యమాన్ (రజి), ఆయన తండ్రి హ్రజత్ హుసైల్‌లు శత్రు సేవల వెనుక వైపు నుండి వచ్చి ముస్లిం సేనల్లో చేరాలని ప్రయత్నించారు. మక్కా వారు వారిద్దరినీ పసిగట్టి నిర్బంధించారు. వారిద్దరూ యుద్ధంలో పాల్గొనరాదన్న షరతుపైనే విడుదల చేశారు. వారిద్దరూ దైవప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, బద్ర్ సంగ్రామంలో పాల్గొనాలన్నదే తమ అభిలాష అని చెప్పారు. కాని దైవప్రవక్త (స) అందుకు అంగీకరించలేదు. ఎంతటి వారైనాసరే మాటంటే మాటేనని, ఎట్టి పరిస్థితిలోనూ ఆడినమాటను తప్పరాదని చెప్పి, వారిని యుద్ధంలో పాల్గొననివ్వలేదు (సహీహ్ ముస్లిం– బాబుల్ వఫా బిల్ అహద్, హదీసు నెం. 1787).

దీనికి సంబంధించిన మరో దృష్టాంతం హుదైబియా ఒడంబడిక. మక్కాలో ముస్లింలుగా మారి మదీనాకు వలస వచ్చిన వారిని ముస్లింలు వాపసు చేయాలన్నది ఆ ఒడంబడికలోని షరతుల్లో ఒక షరతు. ఆ ఒడంబడిక ఓ కొలిక్కి వస్తుండగానే హ్రజత్ అబూజందల్ (రజి) మక్కా నుండి పారిపోయి ముస్లింల వద్దకు వచ్చారు. ఆ సమయంలో అబూ జందల్ కాళ్లకు సంకెళ్ళు వేయబడి ఉన్నాయి. తనను ఎలాగయినాసరే మదీనాకు తీసుకెళ్ళమని ఆయన దైవప్రవక్త (స)కు ప్రాధేయపడ్డారు. ముస్లింలు కూడా ఆయన పరిస్థితిని చూసి తల్లడిల్లిపోయారు. అప్పుడు మక్కా రాయబారి సుహైల్ బిన్ అమ్ర్‌ను వ్యక్తిగతంగా ఎంతగానో నచ్చజెప్పి ఒప్పించడానికి ప్రయత్నించారు. కాని అతను ససేమిరా అన్నాడు. అందువల్ల దైవప్రవక్త (స) అబూ జందల్‌ని వాపసు చేస్తూ, ఓర్పు వహించమని సూచించారు. అల్లాహ్ త్వరలోనే ఏదయినా మార్గం తెరుస్తాడని ధైర్యం చెప్పారు. (సీరత్ ఇబ్నె హిషామ్–2/302).

## విందుకు ఆహ్వానించటం, ఆహ్వానాన్ని స్వీకరించటం

సామాజిక జీవితంలో పరస్పర సౌహార్ధ సంబంధాలకు ఒక అవకాశం విందుకు ఆహ్వానించటం. అలాగే ఒకరు ఆహ్వానిస్తే ఆహ్వానాన్ని స్వీకరించాలి. మహాప్రవక్త (సఅసం) ముస్లిమేతర సోదరులను విందుకు ఆహ్వానించేవారు. ఆయన దైవప్రవక్తగా నియుక్తులైనప్పుడు బనూ హాషిమ్ ప్రముఖులను భోజనానికి ఆహ్వానించారు. ఆ విందు భోజనానికి వచ్చిన వారు 30 మంది వరకూ ఉంటారని అనబడుతోంది. భోజనాలయ్యాక ఆయన (స) వారందరికీ ఇస్లాం ధర్మ పరిచయం చేశారు (అల్ బిదాయ వన్నిహాయ : 3/40).

అలాగే హిజ్రీ 7వ ఏట ఆయన (సఅసం) ఉమ్రా చేసినపుడు మక్కాలో హజ్రత్ మైమూనా (ర.అ)ను నికాహ్ చేసుకుని వలీమా విందుకు మక్కా ప్రముఖులను ఆహ్వానించారు. కాని మక్కా వారు ఆ ఆహ్వానాన్ని స్వీకరించలేదు (సీరత్ ఇబ్నె హిషామ్ : 2 / 372).

అదే విధంగా ఆయన (సఅసం) ఆతిథి మర్యాదను ప్రోత్సహించారు. అతిథులను గౌరవించవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. ఈ విషయంలో ఆయన (ష) ముస్లింలు-ముస్లిమేతరులన్న విచక్షణ చూపలేదు. ఆయన (స) వద్దకు వివిధ తెగలకు చెందిన అతిథి బృందాలు వచ్చేవి. ఆయన (స) వారికి ఆతిథ్యమిచ్చే వారు. బద్ర్ యుద్ధంలో ఖైదీలుగా పట్టుబడిన వారు ఎవరో కారు, శత్రు సైనికులు. అయినప్పటికీ వారి అన్నపానీయాలకై ఉత్తమ రీతిలో ఏర్పాట్లు చేయమని ఆయన తన సహచరులకు ఆదేశించారు. ఈ కారణంగానే సహాబా తాము సాదాసీదా అన్నం తిని యుద్ధ ఖైదీలకు మాత్రం స్వాదిష్టమయిన భోజన ఏర్పాట్లు చేసేవారు (మజ్మవు జ్జవాయెద్ : 6/115, హదీసు నెం. 10007)

ఆయన (స) ముస్లిమేతరుల ఆహ్వానాన్ని స్వీకరించేవారు కూడా. ఒకసారి ఒక యూదు మహిళ ఆయన (స)ను భోజనానికి ఆహ్వానించింది. ఆయన (స)గారు మేక ముంగాలి మాంసాన్ని ఇష్టపడతారని తెలుసుకుని ఆమె ఆ భాగంలో విషం కలిపే సింది. ఆ విషప్రభావం ఆయన (స) మరణ కాలం వరకూ ఉంది. (సహీహ్ బుఖారీ-కితాబుల్ మగాజీ, హదీసు నెం. 452).

# సలామ్

ఒకరింకొకరితో సమావేశమయ్యేందుకు దైవప్రవక్త (సఅసం) నిర్ధారించిన మొదటి వాక్యం "అస్సలాము అలైకుమ్ వ రహ్మాతుల్లాహి వ బరకాతుహ్"(మీపై శాంతి కురియుగాక! అంటే మీరు సురక్షితంగా, క్షేమంగా ఉండుగాక! ఇంకా దైవకారుణ్యం, శుభాలు మీపై వర్షించుగాక!) – 'సలామతి' అంటే అసలు సురక్షితంగా ఉండటమని అర్థం. ఇందులో అన్ని రకాల రక్షణ, భద్రత ఉంది. పాపాల నుండి, రోగాల నుండి వైపరీత్యాల నుండి, దేవుని అవిధేయత నుండి రక్షణ అన్నమాట. 'రహ్మాత్' (కారుణ్యం)లో దేవుని అనుగ్రహ భాగ్యాలన్నీ వచ్చేస్తాయి. అంటే సంతాన భాగ్యం, సంపద భాగ్యం, పరలోక సాఫల్యం ఇత్యాదివన్నీ అందులో చేరి ఉన్నాయి. 'బరకత్' (శుభం, సమృద్ధి) అంటే, ప్రాప్తమై ఉన్న వరప్రసాదాలు, అనుగ్రహాలు మరింతగా వికసించటం, సుదీర్ఘకాలం వరకు నిలిచి ఉండటమని భావం. వాస్తవానికి 'సలాం' అనేది ఒక దీవెన. ఒక దుఆ. దుఆ ముస్లిం కొరకూ, ముస్లిమేతరుని కొరకు కూడా చేయాలి. కాబట్టి ముస్లిమేతర సోదరునికి కూడా 'సలాం' చేయటం ధర్మ సమ్మతం. దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) గారి తండ్రి ఆజర్ ఇస్లాం స్వీకరించ లేదు. అయినప్పటికీ ఇబ్రాహీమ్ (అ) తన తండ్రికి సలామ్ చేశారు. ఖుర్ఆన్ స్వయంగా ఈ విషయాన్ని ప్రస్తావించింది –

''قَالَ سَلٰمٌ عَلَيۡكَ سَاَسۡتَغۡفِرُ لَكَ رَبِّىۡ''

**"(నాన్నా!) మీకు నా సలామ్. నేను మాత్రం మీ మన్నింపు కోసం ప్రార్థిస్తూనే ఉంటాను." (మర్యమ్–47)**

ముస్లిములు, ముష్రిక్కులు, యూదులు కలిసి కూర్చుని ఉన్న బృందానికి దైవప్రవక్త (సఅసం) సలామ్ చేశారు (సహీమ్ బుఖారీ– హదీసు నెం. 5899). సలాం చేసేవారు ఏ ఒక్క వ్యక్తినో ప్రత్యేకంగా ఉద్దేశించకుండా ఉన్నప్పుడు ఆ సమావేశంలో ఉన్న వారంతా సంబోధితులుగానే పరిగణించబడతారు.

మదీనాలోని యూదులు దైవప్రవక్త (స)ను గానీ, ముస్లింలను గానీ కలుసు కున్నప్పుడు నాలుకను కొద్దిగా మెలి త్రిప్పి 'అస్సాము అలైకుమ్' అనేవారు. వినేవారికి అది సలాం పలుకే అనిపిస్తుంది. కాని వారు పలికే దాని అర్థం వేరు. 'మీపై చావు వచ్చిపడుగాక!' అన్నది దాని అర్థం. నిశితంగా గమనిస్తేనేగాని అది బోధపడదు. వారు

ఈ విధమైన వెకిలి చేష్టకు ఒడిగట్టినప్పుడు మీరు 'ప్రతిసలామ్' చేయకుండా, కేవలం 'వ అలైకుమ్' అని అనండి చాలు (అంటే మీ పట్ల కూడా అదే జరుగుగాక! అని దీని అర్థం) అన్నారాయన (స) (బుఖారీ –హదీసు నెం. 5902). – అంటే సలామ్ పదాన్ని వక్రీకరించి శాపనార్థాలు పెట్టే యూదులకు మాత్రమే ఈ సమాధానం వర్తిస్తుంది. అంతేగాని సలామ్ చేసే ఇతరులకు జవాబు ఇవ్వరాదన్న ఆంక్ష ఎంత మాత్రం లేదు.

## కానుకల ఇచ్చిపుచ్చుకోవడాలు

"పరస్పరం కానుకలు ఇచ్చిపుచ్చుకుంటూ ఉండండి. తద్వారా ప్రేమ పెంపొందుతుంది. మనస్పర్థలు దూరమవుతాయి" అని ప్రవక్త మహనీయులు (సఅసం) ఉద్బోధించారు (ముఅజ్జమ్ కబీర్ లిల్ తిబ్రానీ : 25/162; హదీసు నెం. 313). ఈ విషయంలో ఆయన (స) ముస్లింలు–ముస్లిమేతరులన్న తారతమ్యం కనబరచలేదు. పైగా అందరికీ కానుకలు ఇస్తూ ఉండాలని అన్నారు. ఒకసారి దైవప్రవక్త (స) ఒక జత బట్టలను హజ్రత్ ఉమర్ (రజి)కు ప్రదానం చేశారు. ఆ దుస్తులు చాలా ఖరీదైనవి. అందువల్లనే ఆయన (స) వాటిని తొడగలేదు. 'మీరు మీ కోసమే ఇష్టపడనప్పుడు నాకు మాత్రం ఎందుకిచ్చార'ని హజ్రత్ ఉమర్ (రజి) అడిగితే, "నీకు ఇచ్చింది నీవు తొడుక్కుంటానికి కాదు. దానిని అమ్మివేయి లేదా ఎవరికయినా కానుకగా ఇవ్వు" అని దైవప్రవక్త (స) చెప్పారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) మక్కాలోని ఒక వ్యక్తికి ఆ దుస్తులను బహుమానంగా ఇచ్చారు. ఆ వ్యక్తి అప్పటికింకా ముస్లిం కాలేదు (బుఖారీ–కితాబుల్ హిబా, హదీసు నెం. 2476).

మక్కా జనులు ముస్లింలను ఎంతగా వేధించారో తెలిసిందే. కాని మక్కాలో కరువు కాటకాలొచ్చినప్పుడు వారి ఆకలి బాధ వర్ణనాతీతం. ప్రాణాలు కాపాడుకోవటానికి మృత జంతువులను సయితం తినాల్సిన దుర్భర స్థితి ఏర్పడింది. అప్పుడు మదీనాలో ఉన్న దైవప్రవక్త (సఅసం) కరువు కాటకాల బారిన పడిన మక్కా ముస్లిమేతరులకు ఐదు వందల దీనార్లు విరాళంగా పంపించారు. మరి చూడబోతే ఆ రోజుల్లో మదీనా నగరంలో ముస్లింల ఆర్థిక పరిస్థితి కూడా ఏమంత బాగా లేదు. ఐదు వందల దీనార్లు స్వల్ప మొత్తం అనిపించవచ్చు. కాని అప్పట్లో 20 దీనార్లు $87^1/_2$ గ్రాముల బంగారం విలువకు సమానం అన్నది గమనార్హం. ఆ రకంగా ఐదు వందల దీనార్ల విలువ ఎంతో తెలుసుకోవచ్చు. ఆ మొత్తాన్ని ఆయన ఎవరికి పంపారు? ముస్లింలను

అణచి వేయటానికి సర్వశక్తులూ ఒడ్డి కయ్యానికి కాలు దువ్వుతున్న ఖురైషు నాయకులైన అబూ సుఫ్యాన్‌కు! సఫ్వాన్ బిన్ ఉమయ్యాకు!! (రద్దుల్ ముహ్తార్: 3/302, బాబుల్ మ(స్రఫ్).

ఒకసారి మక్కా నుండి ఒక 'నర్తకి' మదీనా వచ్చి ఆర్థిక సహాయం చేయమని అభ్యర్థించింది. దైవప్రవక్త (స) స్వయంగా ఆమెకు ఆర్థిక సాయం అందించటమేగాక, తన కుటుంబీకుల చేత కూడా సాయం చేయించారు. మరి చూడబోతే ఆమె ముస్లిం కాదు. ఆమె వృత్తిని ఇస్లాం ఇష్టపడదన్నదీ విదితమే (బుఖారీ–హదీసు నెం. 3939).

అందరిపట్ల దయాభావంతో మెలగాలని, అందరితోనూ సద్వ్యవహారం చేయాలని ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రబోధించారు. "మీరు నేలనున్న వారిపై కరుణించండి. నింగినున్నవాడు మీపై కనికరిస్తాడ"ని ఆయన (స) బోధించారు (తిర్మిజీ, హదీసు నెం. 1924). ఈ దయాభావంలో ముస్లింలు, ముస్లిమేతరులే గాకుండా జంతువులు కూడా వచ్చేస్తాయి. వేరొక సందర్భంలో ఆయన (స), ప్రాణమున్న ప్రతి దాని పట్ల మంచిగా మెలగండి, ఇందుకుగాను మంచి ప్రతిఫలం ఉంటుందని చెప్పారు (బుఖారీ–హదీసు నెం. 6009). ఇంకా ఇలా అన్నారు: ''فأكل منه انسان او دابة إلا كان له صدقة'' **"ఎవరయినా ఒక ముస్లిం చెట్టు నాటితే, ఆ చెట్టు ఫలాన్ని మనుషులు పశువులు తింటే, దానికిగాను దానం చేసిన పుణ్యఫలం అతనికి లభిస్తుంది"** (ముస్లిం–కితాబుల్ అదబ్, హదీసు నెం. 5666). దీనికి ప్రతిగా ఈ విధంగా కూడా చెప్పారు: ''لا يرحم الله من لا يرحم الناس''. **"ప్రజలపై దయ జూపని వ్యక్తిపై దేవుడు కూడా దయజూపడు"** (బుఖారీ–కితాబుత్తౌహీద్, హదీసు నెం. 6941).

ముస్లిమేతరులకు ఆయన (స) కానుకలు ఇవ్వటమే గాకుండా, వారిచ్చిన కానుకలను స్వీకరించేవారు కూడా. రోము చక్రవర్తి హెరిక్లస్ ఆయనకు పంపించిన కానుకలలో నాణ్యమైన వస్త్రం కూడా ఉంది. (అబూదావూద్–కితాబుల్లిబాస్, హదీసు నెం. 4039). సొంటి కూడా ఉంది (లి ఇబ్నె అబీ హాతిమ్, హదీసు నెం. 906). ఆ కానుకలను ఆయన (స) స్వయంగా స్వీకరించటమేగాక, తన సహచరులకు కూడా పంచిపెట్టారు. 'ఉకైదె రూమా' అనే ఒక సర్దారు కూడా ఆయన (స)కు కొన్ని కానుకలు

పంపించాడు. వాటిలో వస్త్రాలతోపాటు ఇతర వస్తువులు కూడా ఉన్నాయి. వాటిలో నుంచి ఆయన కొన్నింటిని తీసుకుని, మిగతావి తన సహచరులకు పంపిణీ చేశారు (ముస్నదె అహ్మద్–అన్ అనస్: 12245–46). హజ్రత్ అలీ (రజి) గారి కథనంలో ఈరాన్ చక్రవర్తి పంపిన కానుకల ప్రస్తావన కూడా ఉంది. వాటిని కూడా దైవ ప్రవక్త (స) స్వీకరించారు (తిర్మిజీ–హదీసు నెం.1576).

## ధన ప్రాణాల రక్షణ

ముస్లింల ధన ప్రాణాలకు ఆయన (స) ఏ స్థాయినిచ్చారో అదే స్థాయిని ముస్లిమేతరుల ధన ప్రాణాలకు కూడా ఇచ్చారు. ఈ విషయమై ఆయన కొన్ని సూత్రాలను నిర్ధారిస్తూ, 'వారి రక్తం మా రక్తం వంటిది. వారి ధనం మా ధనం వంటిది' అని వక్కాణించారు. ''دمائهم كدمائنا وأموالهم كأموالنا''(నసబుర్రాయ: 3/381)

ఒక సందర్భంలో ఆయన (సఅసం) ఇలా అన్నారు.

من قتل معاهدا لم يرح رائحة الجنة ، و إن ريحها
يوجد من مسيرة أربعين عاماً

**"ఎవరయితే ఏదయినా ఒక ఒడంబడికను (శాంతియుతమైన జీవితం గడిపేందుకు ముస్లిమేతరునితో చేసుకున్న ఒడంబడికను) అంతమొందించాడో, అతను స్వర్గం యొక్క సువాసనను కూడా ఆఘ్రాణించలేడు. నిజానికి దాని సువాసన నలభై ఏండ్ల ప్రయాణ దూరం నుండి వస్తూ ఉంటుంది."**

***(బుఖారీ–అన్ అబ్దుల్లాహ్ అమ్ర్, హదీసు నెం.3166)***

మహాప్రవక్త (సఅసం) హయాంలో ఒక ముస్లిం ఒక ముస్లిమేతర వ్యక్తిని (అన్యాయంగా) హతమార్చిన కారణంగా, హంతకుడైన ఆ ముస్లిం ప్రతీకారం (ఖిసాస్)గా హత్య గావించబడ్డాడు (సుననె దారె ఖుత్నీ– కితాబుల్ హుదూద్, హదీసు నెం.165). ప్రవక్త (స) గారి ఈ న్యాయశీల ప్రభావం ఆయన సహచరులపై ఎలాంటి ముద్ర వేసిందంటే, ఆయన తదనంతరం హజ్రత్ ఉమర్ (రజి) కూడా తన ఖిలాఫత్ కాలంలో ఇలాగే ఒక ముస్లింను ప్రతీకార న్యాయంగా హత్య చేయమని ఆదేశించారు

(సుననె బైహఖీ: 8/30, హదీసు నెం. 15704). హజ్రత్ అలీ (రజి) కూడా తన పరిపాలనా హయాంలో ఈ శాసనాన్ని అమలు పరిచారు (సుననె బైహఖీ : 8/15712).

హతుని హత్యకు ప్రతిగా హంతకుడు వధించబడటమో లేక రక్త శుల్కం (దియత్) చెల్లించటమో జరగాలి. ఇది అనివార్యం. హతుడైన ఒక ముస్లిం వ్యక్తికి ఆయన (స) ఎంత మొత్తంలో 'రక్త శుల్కం' (దియత్)ను నిర్ధారించారో అంతే మొత్తాన్ని ముస్లిమేతర వ్యక్తికీ నిర్ధారించారు (దారెఖుత్నీ–కితాబుల్ హుదూద్, హదీసు నెం. 149).

ఈ విధంగా ఆయన (స) దృష్టిలో ఒక ముస్లిం ధనం ఏ విధంగా గౌరవప్రదమైనదో అదే విధంగా ఒక ముస్లిమేతరుని ధనం కూడా గౌరవప్రదమైనదే, విలువైనదే. అందుకే ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారు:

الامن ظلم معاهدا او انتقصه أو كلفه فوق طاقته أو
اخذ منه شيئاً بغير طيب نفس ، فأنا حجيجه يوم
القيامة

**"జాగ్రత్త! ఎవడయితే తాను ఒడంబడిక చేసుకున్న వాని (ముస్లిమేతర వ్యక్తి)పై దౌర్జన్యం చేశాడో, అతని హక్కును హరించాడో లేదా అతని సమ్మతి లేకుండానే అతని హక్కును లాక్కున్నాడో ప్రళయదినాన నేను అతనికి ప్రతిద్వందిగా ఉంటాను."**

***(అబూ దావూద్ –హదీసు నెం. 3053)***

సాధారణ సమయాల సంగతి అలా ఉంచండి, యుద్ధం లాంటి ఆత్యయిక పరిస్థితిలో కూడా ఆయన (స) ఈ ప్రమాణాలను విధిగా పాటించేవారు. శత్రువు ఆయుధాలు పడవేసి ఆత్మ సమర్పణ చేసుకున్నప్పుడు లేదా సంధికి సిద్ధపడినప్పుడు అతని సొమ్ములకు ఎలాంటి నష్టం కలిగించరాదని చెప్పేవారు. 'ఖైబర్ విజయం' సందర్భంగా ముస్లిం సైనికులు యూదుల కొన్ని పశువులను జిబహ్ చేశారు. ప్రత్యర్థికి చెందిన కొన్ని చెట్ల పండ్లు కోసుకుని తినేశారు. ఈ సంగతి తెలియగానే దైవప్రవక్త(స) ముస్లిములను సమావేశపరచి ప్రసంగిస్తూ; ఈ చర్యపై తన అసహనాన్ని, అసంతృప్తిని వెల్లడించారు. "ఇది మీ కొరకు ఎంతకీ సమ్మతం కాద"ని నిర్ద్వంద్వంగా ప్రకటించారు (అబూదావూద్–హదీసు నెం. 3050). మదీనాలో యూదుల వద్ద 'బైరె రూమా'గా పిలువబడే ఒక బావి ఉండేది. ఆ బావి నుండి మదీనా వాసులంతా మంచినీరు తోడు

కునేవారు. కాని కొన్నాళ్ళ తరువాత బావి యజమాని (యూదుడు) ముస్లింలకు నీరు తోడుకునేందుకు అనుమతించలేదు. దైవప్రవక్త (స) తలచుకుంటే రాజ్యంలోని ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఆ బావిని ప్రభుత్వం తరఫున జప్తు చేసుకుని (జాతీయం చేసి) ప్రజలందరికీ మంచి నీటి సరఫరా చేయగలిగేవారు. కాని ఆయన అలా చేయలేదు. ఆ బావిని కొనుగోలు చేయమని ముస్లిం సహచరుడైన ఉస్మాన్ గనీ (రజి)కి సూచించారు. అప్పుడు ఉస్మానె గనీ (రజి) ఆ బావిలోని సగభాగాన్ని పన్నెండు వేల దిర్హములకు కొనుగోలు చేసి సామాన్య ప్రజలందరికీ అంకితం చేశారు (జాదుల్ మఆద్–5/713–714).

## వ్యాపార సంబంధాలు

వర్తక సంబంధాలలో ఆయన (స) ముస్లిం–ముస్లిమేతరుల మధ్య ఎలాంటి విచక్షణ చూపలేదు. తొలికాలంలో అబూ సుఫ్యాన్, జుబైర్ బిన్ ముత్‌యిమ్ అనే వర్తకులు ఇస్లాం స్వీకరించలేదు. అయితే ఆ సమయంలో కూడా ఆయన (స) వర్తకం కొరకు తన వర్తక సామగ్రిని వారికి ఇచ్చేవారు. వచ్చిన లాభాలలో ముందుగా నిర్ధారించుకున్న దాని ప్రకారం వాటా తీసుకునేవారు. మదీనాలోనైతే ముస్లింల వర్తక మంతా – సాధారణంగా–యూదుల (బనూ ఖైనుఖా) మార్కెట్‌లోనే సాగేది.

దైవప్రవక్త (సఅసం) ముస్లిమేతరులతో క్రయ విక్రయాలు జరిపేవారు. ఆయన (స) పరమపదించిన సమయంలో కూడా ఆయనగారి ఒక రక్షా కవచం ఒక యూదు వ్యక్తి వద్ద తాకట్టుగా ఉంది. ఎందుకంటే ఆయన (స) ఆ యూదు వ్యక్తి వద్ద మూడు 'సా'ల (అరేబియాలో అప్పటి ఒక కొలమానం) బార్లీ గింజలు అరువుగా కొనుగోలు చేశారు (బుఖారీ–హదీసు నెం. 2759). అలాగే ఆయన (స) ముస్లిమేతర వ్యక్తులను తన దగ్గర సేవకులుగా నియమించుకునేవారు. ఆయన (స) మక్కా నుండి మదీనాకు హిజ్రత్ చేసినప్పుడు, ఎడారిలో దారి చూపగల నమ్మకస్తుడైన ఒక వ్యక్తి అవసరం ఏర్పడింది. ఆయన (స) ఎంతో బాధ్యతతో కూడుకున్న ఈ పని కోసం ఒక ముస్లిమేతర వ్యక్తిని వేతనంపై నియమించుకున్నారు (అహ్కామ్ అహ్లుజ్జిమ్మ లి ఇబ్నె ఖయ్యిమ్: 207)

చెప్పవచ్చిందేమిటంటే ముస్లిమేతర వ్యక్తులతో ఆయనగారు, ఆయన శిష్యులు అన్ని రకాల వర్తక సంబంధాలు కలిగి ఉండేవారు.

## న్యాయం, సమభావం

ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రబోధించిన విషయాలలో అత్యంత కీలకమైన, మౌలికమయిన విషయం 'న్యాయస్థాపన'. ఈ వ్యవహారంలో ఆయన మత వివక్షకు తావు లేకుండా చట్ట సమత్వానికి కట్టుబడ్డారు. ఆయన (సఅసం) గారి శిష్యులలో ఒక వ్యక్తి పేరు ఇబ్నె అబీ హద్‌రద్ అస్లమీ. ఆ వ్యక్తి ఒక యూదునికి నాలుగు దిర్హములు బాకీ పడ్డారు. తన బాకీ తీర్చటం లేదని యూదుడు (దైవప్రవక్త (స)కు ఫిర్యాదు చేశాడు. దైవప్రవక్త (స) తన శిష్యుణ్ణి పిలిచి అతని అప్పు తీర్చమని చెప్పారు. 'అయ్యా! ప్రస్తుతం నేను అప్పు తీర్చగల స్థితిలో లేన'ని చెప్పాడా వ్యక్తి. "అతని రుణం చెల్లించు" అని దైవప్రవక్త (స) రెండవసారి ఆదేశించారు. 'అయ్యా దైవప్రవక్తా (స)! ఇప్పుడంటే ఇప్పుడే రుణం తీర్చే స్థోమత నాకు లేదు. తమరు నన్ను ఏదయినా పనిపై ఖైబర్ పంపినపుడు, ప్రతిఫలంగా ఎంతో కొంత ఇస్తారన్న ఆశ నాకుంది. అప్పుడే నేను ఈయన గారి అప్పు తీర్చేస్తాన'ని ఇబ్నె అబీ హద్రద్ విన్నవించుకున్నారు. కాని దైవప్రవక్త (స) మూడవసారి కూడా, "ఇతని రుణం తీర్చేయి"అని ఆజ్ఞాపించారు. దైవప్రవక్త (స) ఏదన్నా విషయం మూడు సార్లు చెప్పారంటే, ప్రియసహచరులు ఇక మారు మాట్లాడే వారు కారు. ఇబ్నె అబీ హద్రద్ ఆ సమయంలో ఒక వస్త్రాన్ని తలపాగాగా చుట్టుకుని, మరో వస్త్రాన్ని లుంగీగా కట్టుకుని ఉన్నారు. తలపాగాను లుంగీగా చేసుకుని, లుంగీని మార్కెట్టులో అమ్మకానికి పెట్టారు. దానిని నాలుగు దిర్హములకు అమ్మి ఆ డబ్బును యూదునికి ఇచ్చేశారు (ముస్నదె అహ్మద్ – హదీసు నెం. 15528, ఇబ్నె అబీ హద్రద్).

ఈ న్యాయ వ్యవహారం కేవలం తన సహచరుల వరకే పరిమితం కాలేదు, తన వ్యక్తిగత విషయంలో కూడా ఆయన (స) పూర్తిగా దీనికి కట్టుబడి ఉన్నారు. తాను ఎవరికయినా బాకీ పడి వుంటే రుణదాతకు అడిగే హక్కు కచ్చితంగా ఉంటుందని క్రియాత్మకంగా నిరూపించారు. ఒకవేళ బాకీ వసూలు విషయంలో రుణదాత కరకుగా మాట్లాడినా సహించి ఊరుకునేవారు. ఆయన (స) జైద్ బిన్ సానా అనే యూదు వ్యక్తి వద్ద అప్పు తీసుకున్నారు. అతను వచ్చి దైవప్రవక్త (స) అంగీని పట్టుకుని లాగుతూ

పరుష వాక్యాలు పలికాడు. 'నా రుణం తీరుస్తావా లేదా? ఎందుకు తీరుస్తావులే? బనీ ముత్తలిబ్ వంశస్తులంతా ఇంతే. దాటవేసే రకం' అన్నాడు. ఈ మాట వినగానే హ్రజత్ ఉమర్ (రజి) చివాలున లేచి నిలబడ్డారు. యూదు వ్యక్తిని ఒక్క తోపు తోశారు. అప్పుడు దైవప్రవక్త (స) ఉమర్‌ని వారిస్తూ, "ఉమర్! నేనయినా, ఇతనయినా నీ నుండి ఆశించింది ఇది కాదు. ఉత్తమ రీతిలో అప్పు తీర్చండి అని నీవు నాకు చెప్పాల్సింది, సరైన పద్ధతిలో అడగమని అతనికి నచ్చజెప్పాల్సింది. కాబట్టి ఇప్పుడు నువ్వెళ్ళి అతని అప్పు తీర్చిరా. నువ్వతన్ని భయపెట్టినందుకు బదులుగా ఇరవై 'సా'ల ఖర్జూరాలు అధికంగా ఇవ్వాలి" అని తాకీదు చేశారు (ముస్తద్రక్ హాకిమ్–హదీసు నెం. 6574).

## మత వ్యవహారాలు

కేవలం సామాజిక వ్యవహారాల్లోనే కాకుండా, ధార్మిక విషయాలలో కూడా ఆయన (స) ముస్లిమేతరులతో సహన భావంతో మెలిగేవారు. ఎదుటి వారి ఇష్టా యిష్టాలతో నిమిత్తం లేకుండా వారిపై ఇస్లామ్‌ను రుద్దేవారు కారు. అందుకే ఆయన (స) మక్కాలో ఉన్న కాలంలో, పుర ప్రముఖులనుద్దేశించి, "మీరు ఇస్లాం ధర్మం స్వీకరించకపోతే పోనివ్వండి. కాని ఇస్లాం ధర్మ ప్రచార మార్గంలో మాత్రం అవరోధం కల్పించకండి. ప్రజలందరినీ తమ తమ మతం ప్రకారం మెలగనివ్వండి" అని అభ్యర్థించారు. దీనినే ఖుర్‌ఆన్ ''لكم دينكم ولى دين'' **"మీ ధర్మం మీది, నా ధర్మం నాది"** (అల్ కాఫిరూన్–6) అని చెప్పింది.

మక్కా నుండి వలసపోయి మదీనా నగరానికి ఏతెంచినపుడు ప్రవక్త మహ నీయులు (సఅసం) చేపట్టిన ప్రప్రథమ పనులలో ఒకటేమంటే; మదీనాలో నివసిస్తున్న వివిధ మత వర్గాల, తెగల మధ్య శాంతి ఒప్పందం చేయటం. ఆ ఒప్పందంలో ముస్లింలు, యూదులు, బహు దైవారాధకులు కూడా ఉన్నారు. ఈ ఒడంబడికలో ప్రధాన అంశాలు రెండు. ఒకటి: నగర రక్షణకై అందరూ కలిసికట్టుగా ఉండటం. రెండవది: ప్రతి వర్గం వారు రెండవ వర్గం వారికి గల ప్రతిపత్తిని అంగీకరించటం. ఎవరి మతాన్ని వారు అవలంబించటంలో స్వేచ్ఛ ఉండటం. ఆ ఒడంబడికలోని పదజాలం ఇలా వుంది –

"యూదులు కూడా ముస్లింల మాదిరిగానే ఒక జాతిగా పరిగణించబడతారు. వారిపై ఎవరు యుద్ధానికి వచ్చినా, వారికి వ్యతిరేకంగా ముస్లింలు యూదులకు సహాయం చేస్తారు. ముస్లింలు-యూదుల మధ్య గల సంబంధాలు పరస్పర శ్రేయోభిలాషతో కూడినవిగా ఉంటాయి. ఉభయతారకంగా, మంచికి దోహదపడేవిగా ఉంటాయి. యూదులతో మైత్రీ ఒప్పందం ఉన్న వారు కూడా ఈ ఒడంబడికలో చేరి ఉన్నట్లుగానే పరిగణించబడతారు. సదా బాధితులకు తోడ్పడటం జరుగుతుంది."(సీరత్ ఇబ్నె హిషామ్: 1/178)

ఇలాగే నజరాన్ ప్రాంతానికి చెందిన ఒక క్రైస్తవ ప్రతినిధి బృందం దైవప్రవక్త (సఅసం) దగ్గరకు వచ్చింది. ఆయన (స) వారితో ఒడంబడిక చేసుకుంటూ, వారికి వ్రాయించి ఇచ్చిన దస్తావేజులో ఇలా వుంది:

"నజరాన్ వాసులకు అల్లాహ్ రక్షణ ఉంటుంది. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) తరఫున వారికి అభయం ఉంటుంది. వీరి ప్రాణం, మతం, రాజ్యం, ధనానికి సంబంధించి ఇక్కడ వున్నవారు, ఇక్కడ లేనివారు, వీరి జాతి వీరి అనుయాయులు – అందరూ ఈ శాంతి ఒడంబడికలో చేరి ఉన్నట్లుగానే భావించబడతారు. ప్రస్తుతం వీరున్న స్థితిలో ఎలాంటి మార్పు చేయబడదు. వీరికి చెందిన హక్కులలో ఎలాంటి మార్పు ఉండదు. ప్రస్తుతం వీరి స్వాధీనంలో ఉన్నది –అది కొంచెమైనా, ఎక్కువైనా – అందులో ఎలాంటి పరివర్తన చేయబడదు." **(ఫుతూహుల్ బల్దాన్, బలాజరీ : 1/77)**

పర మత ప్రముఖుల విషయంలో ఆయన (స) ఎంతో సహిష్ణుతను పాటించే వారు. వారు నమ్మినడుచుకునే వారిని దూషించి వారి మనసును నొప్పించకండి అని ప్రత్యేకంగా సూచించేవారు. ఒకసారి మదీనాలో ఒక సంఘటన ఎదురయింది– ఒక యూదు వ్యక్తి ఏదో మాటపై ప్రమాణం చేస్తూ, 'సమస్త మానవాళిలో నుంచి మూసాను ప్రత్యేకంగా ఎన్నుకున్న శక్తిమంతుని సాక్షిగా' అన్నాడు. అంటే ప్రవక్తలందరిపైనా మూసా (అ) కు ఆధిక్యత ఉంది అన్నది దాని సారాంశం. కాగా; ముహమ్మద్ ప్రవక్త (సఅసం)కు మానవులందరిపై, ప్రవక్తలందరిపై ప్రాధాన్యత వొసగబడిందన్నది ముస్లింల విశ్వాసం. అందుకే ఒక అన్సారీ సహాబీకి ఈ మాట సహించలేదు. ఆ విధంగా ప్రమాణం చేసిన యూదుణ్ణి నానా విధాలుగా దూషించటమేగాక కోపంతో

అతనికి చెంప దెబ్బ కూడా కొట్టారు. ఆ యూదు వ్యక్తి దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి అన్సారీ గురించి ఫిర్యాదు చేశాడు. ఆయన (స) తన సహచరుడైన అన్సార్ వ్యక్తిని పిలిచి, "చూడు! ప్రవక్తల మధ్య విచక్షణ చూపుతూ, ఒకరికి మరొకరిపై ప్రాధాన్యత కల్పిస్తూ వాదించకూడదు" అని హితవు పలికారు. తరువాత ఆయన (స) మహనీయ మూసా (అ)లోని ఒక విశిష్ఠతను ప్రస్తావిస్తూ, అది ప్రళయదినాన ప్రస్ఫుట మవుతుందని చెప్పారు. (బుఖారీ–హదీసు నెం. 2412) – అంటే ఆ క్షణంలో ఆయన ఎంతో విజ్ఞతతో వ్యవహరిస్తూ, దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)లోని ప్రత్యేకతను ప్రస్తావించి ఆ యూదు అనుయాయికి కలిగిన మనస్తాపాన్ని దూరంచేసి, ఆ గొడవ సద్దుమణిగేలా చేశారు. ధార్మిక ప్రముఖులను కించపరిచే విధంగా మాట్లాడి, వారి అనుయాయుల్లో అసహనాన్ని సృష్టించటం ఎంతమాత్రం సమంజసం కాదన్నది ఆయన మాటల అంతరార్థం.

## మన్నింపుల వైఖరి

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) లోని అత్యంత ముఖ్యమైన సద్గుణం 'క్షమాగుణం, మన్నింపుల వైఖరి'. ఆయన తన సహచరులను ఎలాగూ క్షమించేవారు. మరుపువల్ల జరిగిన పొరపాట్లపై వారిని నిలదీయకుండా వారి పట్ల సడలింపుల వైఖరిని ఎలాగూ అవలంబించేవారు. అయితే ఆయన (స) తన బద్ధ విరోధులను, అడుగడుగునా తనను వేధించి బాధించిన వారిని సయితం క్షమించి వదలిపెట్టడం విశేషం. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన కొన్ని సంఘటనలను స్మరించు కోవటం సమంజసంగా ఉంటుంది –

- ఒకసారి మక్కాలో తీవ్ర దుర్భిక్షం తాండవించింది. ప్రజలు మృత జంతువును సయితం తినాల్సిన అగత్యం ఏర్పడింది. మరి చూడబోతే ఆ జనులు ఎవరో కాదు, దైవప్రవక్త (స)ను, ఆయన ప్రియసహచరులను సంఘ బహిష్కరణ చేసి ఒక్కో ఆహారధాన్యపు గింజ కూడా వారికి చేరకుండా అడ్డుకున్నవారు. మక్కాలో ముస్లింలు నాలుగేండ్ల వరకూ ఈ కఠినమయిన ఆర్థిక ఆంక్షలను భరించారు. కాని ఆయన (స) మదీనాకు హిజ్రత్ చేసిన మీదట మక్కాలో కరువు కాటకాలొచ్చి అక్కడి ప్రజలు తిండికి తిప్పలు పడాల్సిన దుస్థితి దాపు

రించింది. అప్పుడు మక్కా నాయకులు ఆయన (స) దగ్గరకు వచ్చి, 'తమరు బంధువుల యెడల ఉత్తమంగా మెలగమని బోధిస్తారు కదా! ఇప్పుడు మీ జాతి వారు దుర్భర దారిద్ర్యంతో అంతమవుతున్నారు. కాబట్టి తమరు (దేవుని కొరకు) ఈ దుర్భిక్షాన్ని దూరం చేయమని దైవాన్ని ప్రార్థించండి' అని కడు దీనంగా అభ్యర్థించారు. ఈ మాటలకు కారుణ్యమూర్తి (స) హృదయం కరిగి పోయింది. ఆయన (స) చేతులెత్తి వారి కష్టాన్ని తొలగించమని అల్లాహ్‌ను వేడుకున్నారు. తరువాత మక్కాలో పుష్కలంగా వానలు కురిశాయి (బుఖారీ–కితాబుల్ ఇస్తిస్ఖా, హదీసు నెం. 974).

- నజద్ క్షేత్రం వైపు నుండి మక్కా నగరానికి ఆహార ధాన్యాలు సరఫరా అయ్యేవి. కాని ఆ ప్రాంత సర్దారైన సుమామా బిన్ ఉసాల్ ఇస్లాం స్వీకరించిన మీదట, మక్కాకు ఆహార ధాన్యాల సరఫరాను నిలిపివేశారు. దైవప్రవక్త (సఅసం) ఆనతి లేనిదే ఒక్క ధాన్యపు గింజ కూడా ఇక్కడి నుండి మక్కాకు పోవడానికి వీల్లేదని చెప్పారు సుమామా. అయితే అలా చేయవద్దని దైవప్రవక్త (స) ఆయనకు నచ్చ జెప్పారు (సీరత్ ఇబ్నె హిషామ్ : 2/638).
- హుదైబియా ఒడంబడిక సందర్భంగా ఆయన (సఅసం) ప్రభాత సమయాన తన సహచరులతో కలిసి నమాజ్ చేస్తున్నారు. ఆ సమయంలో ఓ డెబ్బయి ఎనభైమంది 'తన్‌యీమ్' అనే కొండ ప్రాంతం వైపు నుండి ఆకస్మికదాడి చేయడానికి వచ్చారు. ముస్లింలు నమాజు చేస్తుండగా వారిపై మెరుపుదాడి చేయాలన్నది వారి ఉద్దేశం. వారంతా పట్టుబడ్డారు. కాని దైవప్రవక్త (స) వారికెలాంటి శిక్ష విధించకుండానే, వారి నుండి ఫిదియా (పరిహారం) కూడా పుచ్చుకోకుండానే విడుదల చేసేశారు (ముస్లిం–కితాబుల్ జిహాద్, హదీసు నెం. 1808).
- మహాప్రవక్త (సఅసం) గారి బద్ధ విరోధులలో అగ్రగామి అబూజహల్. అతని కొడుకు ఇక్రమాకు కూడా ఈ శత్రుత్వం వారసత్వంగా సంక్రమించింది. మక్కా విజయం సందర్భంగా అతను యమన్‌కు పారిపోయాడు. అతని భార్య ఉమ్మె హకీమ్ బిన్తె హారిస్ అబూ జహల్ బంధువే. ఆమె మాత్రం ఇస్లాం

స్వీకరించింది. తన భర్తకు క్షమాభిక్ష ప్రసాదించమని దైవప్రవక్త (స) ను అభ్యర్థించింది. ఆయన (స) క్షమాభిక్ష పెట్టారు. అప్పుడామె స్వయంగా యమన్ వెళ్ళి, దైవ ప్రవక్త (స) అతనికి క్షమాభిక్ష ప్రసాదించారని చెప్పింది. ఆ క్షణంలో ఇక్రమా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది. కరడు గట్టిన నా లాంటి బద్ధ విరోధిని కూడా ప్రవక్త (స) క్షమించారా!? అని ఆలోచనలో పడి పోయాడు. తరువాత అతను తన భార్యతో కలిసి ప్రవక్త (సఅసం) సన్నిధిలో హాజరయ్యాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) నిలబడి, అతనికి ఎదురేగి స్వాగతం పలికారు. అతన్ని హృదయానికి హత్తుకుని గాఢంగా ఆలింగనం చేసుకున్నారు. అంతే, ఆ పాషాణ హృదయం కరిగిపోయింది. ఇస్లాం స్వీకరించి ముహమ్మద్ అనుయాయుల్లో విలీనమైపోయాడు (ముస్తద్రక్ హాకిమ్–హదీసు నెం. 5055).

- మహాప్రవక్త (సఅసం) గుండె కోతకు కారకులైన వారిలో హబ్బార్ బిన్ అస్వద్ ఒకడు. ప్రవక్త (స) పుత్రిక జైనబ్ హిజ్రత్ చేస్తున్న సమయంలో అతనామెను హింసించిన తీరువల్ల ఆమెకు గర్భస్రావం జరిగిపోయింది. మక్కా విజయం జరిగిన కొన్నాళ్ళకు అతను ప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, 'నేను అపరాధిని. నా వల్ల చాలా పెద్ద పాపం జరిగిపోయింది' అని పశ్చాత్తాపం ప్రకటించాడు. ఆ తరువాత తనకు తానై 'లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్' వచనం పలికాడు. అప్పుడు ఆయన (స) అతని అమానుషాన్ని కూడా క్షమించి వదలిపెట్టేశారు. అతనిపై ప్రతీకారం తీర్చుకోలేదు (అల్ ముఅజ్జముల్ కబీర్: 1051).

- ఉహుద్ సంగ్రామంలో వహ్షీ బిన్ హరబ్ అనే నీగ్రో బానిస హజ్రత్ హమ్జా (రజి)ను వధించాడు. హమ్జా (రజి) వీరమరణం దైవప్రవక్త (స)ను బాగా కృంగదీసింది. ఎట్టకేలకు వహ్షీ దైవప్రవక్త (స) ముందు ఆత్మ సమర్పణ చేసుకుని, ఇస్లాం స్వీకరించాడు. కారుణ్యమూర్తి (స) అతనిని కూడా క్షమించి వదలిపెట్టారు. అయితే పదే పదే నా ముందుకు రావద్దని, నిన్ను చూసి నప్పుడల్లా నా పినతండ్రి హమ్జా (రజి) జ్ఞప్తికి వస్తున్నారని మాత్రం కోరారు (సీరత్ ఇబ్నె హిషామ్ : 2/70).

- ఇస్లాం బద్ధ శత్రువులలో 'సఫ్వాన్ బిన్ ఉమయ్యా' ఒకడు. ఆయన మక్కా ప్రముఖులలో ఒకడుగా పరిగణించబడేవారు. మక్కాను ముస్లింలు జయించి నపుడు, ఆయన అక్కడి నుంచి పలాయనం చిత్తగించి, యమన్ వెళు తున్నారు. ఆయనకు రక్షణ కల్పించమని ఉమైర్ బిన్ వహ్బ్ దైవప్రవక్త (సఅసం)ను అభ్యర్థించారు. అప్పుడు దైవప్రవక్త (స) ఆ బద్ధ విరోధికి క్షమా భిక్ష ప్రసాదించటమే గాకుండా, తన తరపున అభయానికి చిహ్నంగా తన తలపాగాను కూడా ప్రదానం చేశారు. అప్పుడు ఉమైర్ వెళ్ళి ఆయన్ని పిలుచు కువచ్చారు. సఫ్వాన్ దైవప్రవక్తనుద్దేశించి, 'తమరు నాకు క్షమాభిక్ష పెట్టిన సంగతి నిజమేనా?' అని అడిగారు. "అవున"న్నారాయన (స). 'అయితే ధర్మపరివర్తన చెందే విషయంలో నాకు రెండు మాసాల గడువు ఇవ్వండి' అని సఫ్వాన్ కోరగా, "రెండు కాదు, నాలుగు మాసాల గడువు ఇవ్వబడింది" అని ప్రవక్త మహనీయులు (స) చెప్పారు (ముఅత్తా ఇమామ్ మాలిక్–హదీసు నెం. 1132).
- ఇస్లాం ఉద్యమాన్ని వ్యతిరేకించటంలో మున్ముందు ఉన్నవారిలో 'ఉత్బా' ఒకరు. ఆయన కుమార్తె హిందాకు ఈ శత్రుత్వం బహుశా వారసత్వంగా సంక్రమించిందేమో! ఉహుద్ యుద్ధ సందర్భంగా హజ్రత్ హమ్జా (రజి) మృత దేహాన్ని చీల్చి ఆయన పచ్చికాలేయాన్ని నమలిన కిరాతకురాలు ఆమె. అంతేకాదు, హమ్జా (రజి) మృత దేహాన్ని 'ముస్‌లా' చేసి గుర్తు పట్టడానికి వీలులేకుండా చేసింది. మక్కా విజయం నాటి వరకూ ఇస్లాం పట్ల ఆమె శత్రుత్వంలో గల తీవ్రత ఏ మాత్రం తగ్గలేదు. మక్కా విజయం తర్వాత ఆవిడ ముఖం కనబడకుండా ముసుగు వేసుకుని ప్రవక్త (స) సన్నిధిలో హాజరయి ఇస్లాం స్వీకరించింది. ఆ సమయంలో కూడా ఆమె దైవప్రవక్త (సఅసం) పై ఘాటైన విమర్శలు గుప్పించింది. ఆయన (స) వాటన్నింటినీ పెద్ద మనసుతో మన్నించారు. (అర్రహీఖుల్ మఖ్తూమ్: 1/393)
- ఒక ప్రయాణ సందర్భంగా దైవప్రవక్త (స) ఒకచోట చెట్టుకు ఖడ్గం వ్రేలాడదీసి, ఆ చెట్టు నీడలో విశ్రమించారు. అంతలో ఒక వ్యక్తి వచ్చి ఖడ్గాన్ని వశపరచుకుని, 'ఇప్పుడు నా నుండి నిన్ను రక్షించేదెవరో చెప్పుకో' అని ఆయన్ని

ప్రశ్నించాడు. “అల్లాహ్” అని ఆయన (స) ఎంతో ప్రశాంతంగా సమాధాన మిచ్చారు. ఈ మాట వినగానే అతనిలో వణుకుపుట్టింది. ఖడ్గం చేజారి క్రింద పడిపోయింది. తక్షణం ఆయన (స) ఆ ఖడ్గాన్ని తీసుకుని “ఇప్పుడు చెప్పు. నా బారి నుండి నిన్ను రక్షించేదెవరు?” అని అడిగే సరికి బిత్తరపోయాడు. తన పట్ల కనికరంతో వ్యవహరించమని కోరాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) అతనికి క్షమాభిక్ష పెట్టారు. (ముస్లిం–కితాబుల్ ముసాఫిరీన్, హదీసు నెం. 843)

- మదీనాలో కపటుల వర్గమొకటి ఉండేది. వారు తమను తాము ముస్లింలుగా చెప్పుకునేవారు. కాని వాస్తవానికి వారు ముస్లింలు కారు. కొన్నిసార్లు యూదు లతో, మరికొన్నిసార్లు మక్కా వారితో కుమ్మక్కయి ముస్లింలకు వ్యతిరేకంగా కుట్రలు పన్నేవారు. ఆ కపట వర్గానికి అబ్దుల్లాహ్ బిన్ ఉబై అనే వ్యక్తి నాయకత్వం వహించేవాడు. ఒక ప్రయాణ సందర్భంగా అతను ముహా జిర్లకు–అన్సార్లకు మధ్య చిచ్చుపెడుతూ, “మనం మదీనా చేరుకున్న మీదట మనలోని గౌరవనీయులు అల్పులను నగరం నుండి వెళ్లగొడతార”ని అన్నాడు. దైవప్రవక్త (స)ను, ఆయన సహచరులను దృష్టిలో పెట్టుకుని అతను చెప్పిన నీచమైన మాట అది. అయితే అతని కుమారుడు చిత్తశుద్ధి కల ముస్లిం. తండ్రి చెప్పిన ఈ మాట అతనికెంతో మనస్తాపం కలిగించింది. ఆ ప్రయాణ బృందం మదీనా పొలిమేరలకు చేరుకోగానే కుమారుడు అతని దారికి అడ్డంగా నిలుచుని, ‘(నాన్నా!) దైవప్రవక్త (సఅసం) అనుమతి ఇచ్చేంతవరకూ మీరు మదీనా నగరంలో అడుగుపెట్టలేర’ని కరాకండీగా చెప్పేశారు. తండ్రి దారికి కొడుకు అడ్డంగా నిలిచాడని తెలియగానే దైవప్రవక్త (స) జోక్యం చేసుకుని, “తప్పు. అలా చేయకూడద”ని బోధించారు. (సీరత్ ఇబ్నె హిషామ్ : 2/290)

  అబ్దుల్లాహ్ బిన్ ఉబై మరణించినప్పుడు ఏమయిందో చూడండి! అతను ముస్లిం కాదని తెలిసినప్పటికీ, అతని కుమారుని అభ్యర్థనపై దైవప్రవక్త (సఅసం) తన అంగవస్త్రాన్ని అతనికి ‘కఫన్’గా ప్రదానం చేశారు (బుఖారీ–కితాబుల్ జనాయెజ్, హదీసు నెం. 1210)
- ఒకసారి ఒక యూదు స్త్రీ ఆయన్ని విందుకు ఆహ్వానించింది. ఆయన మేక మాంసాన్ని, అందులోనూ ముఖ్యంగా మేక ముంగాలి మాంసాన్ని ఇష్టపడతా

రని తెలుసుకుని, ఆ మాంస భాగంలో విషం కలిపింది. ఆయన ఆ మాంసాన్ని నోట్లో పెట్టుకోగానే, అందులో విషం ఉందన్న సంగతి ఆయనకు తెలిసి పోయింది. అందువల్ల విందు భోజనం ఆరగించకుండానే లేచి వెళ్ళి పోయారు. అయితే ఆ విష ప్రభావం జీవితాంతం ఆయన్ని వెంటాడింది. “ఎందుకిలా చేశావ్?” అని ఆయన (స) ఆమెను ప్రశ్నించగా, ‘తమరు నిజమైన ప్రవక్తో కాదో తెలుసుకోవాలనుకున్నాను. మీరు నిజంగా దైవప్రవక్త అయి వుంటే దేవుడు మిమ్మల్ని ఎలాగయినా కాపాడుకుంటాడు. దివ్యవాణి ద్వారా ఆ విషయం మీకు తెలిసిపోతుంది. ఒకవేళ మీరు దైవప్రవక్తనని అబద్ధం చెబుతున్నట్లయితే ప్రజలకు మీ బెడద నుండి విముక్తి లభిస్తుంది’ అని భావించానని సమాధానమిచ్చింది ఆ యూదు మహిళ. దైవప్రవక్త (సఅసం) ఆమెకు క్షమాభిక్ష పెట్టారు. కాని ఆ విందు భోజనంలో పాల్గొన్న ఒక సహచరుడు ఆ విష ప్రభావంవల్ల మరణించారు. ఆ మృత సహాబీ ‘ఖిసాస్’ (ప్రతీకార న్యాయం)గా ఆమెకు మరణశిక్ష విధించటం జరిగింది. ఎందుకంటే హంతకుణ్ణి క్షమించి వదలిపెట్టాలా లేక ప్రతీకారం తీర్చుకోవాలా? అనేది హతుని వారసుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యవహారంలో ఇతరులు జోక్యం చేసుకుని హంతకుణ్ణి క్షమించలేరు. (అబూదావూద్– కితాబుద్దియాత్, హదీసు నెం. 4512)

- సఫ్వాన్ బిన్ ఉమయ్యా ఉసిగొల్పడంతో ఉమైర్ బిన్ వహబ్ ఒక కుట్రలో భాగంగా దైవప్రవక్త (సఅసం)ను హత్య గావించేందుకు మదీనా వచ్చాడు. అతను ప్రవక్త (స) దగ్గరకు వచ్చినప్పుడు అతని మెడలో ఖడ్గం వ్రేలాడుతూ ఉంది. నీ రాకలోని ఉద్దేశ్యమేమిటో చెప్పమని దైవప్రవక్త (సఅసం) అడిగితే, వేరే కారణమేదో చెప్పాడు. అప్పుడు ఆయన (స) అతని లోగుట్టును బట్ట బయలుచేస్తూ, “నీవు ఫలానా వ్యక్తితో కలిసి కుట్ర పన్నలేదా? నీ రాకలోని ఉద్దేశం ఇది (నన్ను హత్య గావించటం) కాదా?” అని చెప్పేసరికి నీళ్లు నమిలాడు. చివరకు తన దురుద్దేశాన్ని ఒప్పుకున్నాడు. ఆ క్షణంలో అతను ఆయన (స) నియంత్రణలోనే ఉన్నాడు. అయితే దైవప్రవక్త (సఅసం) అతన్ని క్షమించి వదలిపెట్టేశారు (సీరత్ ఇబ్నె హిషామ్ : 1/661).

- బద్ర్ యుద్ధ సందర్భంగా సుహైల్ బిన్ అమ్ర్ పట్టుబడ్డాడు. అతను ఇస్లాంను, ఇస్లాం ప్రవక్త (స)ను తీవ్రంగా దూషించేవాడు. మంచి ఉపన్యాసకుడు. అతన్ని విడిచిపెట్టండి అని దైవప్రవక్త (సఅసం) ఆదేశించినపుడు, ఇక మీదట మీకు వ్యతిరేకంగా ప్రసంగించకుండా ఉండేలా సుహైల్ ముందు పల్లు రెండూ రాలగొట్టండి అని హజ్రత్ ఉమర్ (రజి) సలహా ఇచ్చారు. దానికి దైవప్రవక్త (సఅసం), "నేను ఇతని 'ముస్‌లా' చేయను (ఇతని శరీరావయవాలను కోయను). నేను గనక అలా చేశానంటే అల్లాహ్ నా 'ముస్‌లా' చేస్తాడు–నేను దైవప్రవక్తనయినాసరే" అని ఆయన (సఅసం) చెప్పారు (కన్జుల్ అమాల్–హదీను నెం. 37137).

ఆయన (సఅసం) గారి ఇలాంటి మన్నింపుల సంఘటనలు చాలా ఉన్నాయి. వాటన్నింటినీ సేకరిస్తే ఒక పెద్ద పుస్తకమే అవుతుంది. ఆయన (స) పవిత్ర జీవిత చరిత్రలోని అత్యంత ముఖ్యమయిన కోణమిది. అయితే ఈ మన్నింపులకు సంబంధించిన అతి పెద్ద సంఘటన మాత్రం మక్కా విజయం సందర్భంగా ఎదురయినదే. ఆ రోజున ఆయన (స) ప్రకటించిన సర్వసామాన్యమయిన మన్నింపుల ప్రకటన చరిత్రలోనే అరుదైనది.

## కాస్త ఆలోచించండి!

మక్కా జనులు ఆయన (స)ను ఆయన శిష్యులను ఎన్నెన్ని రకాలుగా వేధించారు? వారు దళిత ముస్లిములను నిర్దాక్షిణ్యంగా హతమార్చారు. మండుటెండల్లో ఇసుకపై, రాళ్లపై పడవేసి ఈడ్చేవారు. భయపెట్టి తమ దారికి రప్పించుకునేందుకు ముంతపొగ పెట్టేవారు. కొరడా దెబ్బలు కొట్టేవారు. సంఘ బహిష్కరణ చేసి బనూ హాషిమ్, బనూ ముత్తలిబ్ సభ్యులను ఆకలిదప్పులకు లోను చేశారు. నాలుగేండ్ల పాటు వారి బ్రతుకును దుర్భరం చేశారు. దైవప్రవక్త (సఅసం)కు మానసికంగా పెట్టిన క్షోభ అంతా యింతా కాదు. ఆయనకు మతి భ్రమించిందని చెప్పారు. ఆయన ఒక మాంత్రికుడని నిందించారు. ఆయన (స) నడిచే దారిలో ముళ్ళ కంపలు వేశారు. బురద జల్లారు. రాళ్ళు రువ్వారు. వివాహితులైన ఆయన (స) కుమార్తెలకు విడాకులిప్పించారు. గర్భవతి అయిన ఆయన (స) కుమార్తెపై దాడి జరిపించి ఆమె గర్భస్రావానికి

కారకులయ్యారు. కాబా గృహ ప్రాంగణంలోనే ఉరివేసే ప్రయత్నం చేశారు. ఆయన్ని హతమార్చేందుకు కుట్ర పన్ని గత్యంతరం లేని స్థితిలో ఆయన (స) మక్కా నగరం విడిచిపోయేలా చేశారు. మదీనాలో కూడా ప్రశాంతంగా ఉండనివ్వలేదు. అక్కడి ముస్లింలపై కయ్యానికి కాలు దువ్వారు. ఆయన పిన తండ్రి – హమ్జా– మృత దేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి, పచ్చి కాలేయాన్ని కసితీరా నమిలారు. యుద్ధ రంగంలో స్వయంగా ప్రవక్త (సఅసం) గారి దంతాలు ఊడి పోయాయి. ఆయన ముఖారవిందం రక్తసిక్తమయింది. ఒక్కమాటలో చెప్పాలంటే సర్వవిధాలా హింసించారు.

ఆ నేరస్తులంతా మక్కా విజయం నాడు ఆయన ఎదుట నిలబడి ఉన్నారు. పదివేల మంది సైనికులు ప్రవక్త (స) వెంట ఉన్నారు. ఆయన (స) గారు ఇచ్చే ఒక్కో ఆదేశాన్ని అమలుపరచడానికి వారు సిద్ధంగా ఉన్నారు. కాని ఆయన (స) మాత్రం అలా చేయలేదు. ఆ ముష్కరమూకను ఆయన (స) ఒక్కసారి కూడా తీక్షణంగా చూడలేదు. వారి అమానుష కృత్యాలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించలేదు. **“చెప్పండి! ఈ రోజు మీరు నా నుంచి ఆశించేదేమిటి?”** అని మాత్రం అడిగారు. దానికి వారు, ‘తమరు మా మంచి సోదరులు, మర్యాదస్తులు. మర్యాదస్తులైన మా అన్న కుమారులు’ అని బదులిచ్చారు. అప్పుడు అంతిమ దైవప్రవక్త (సఅసం) **“అలనాడు మహనీయ యూసుఫ్ (అ) తన అన్నలతో చెప్పిన మాటే, ఈనాడు నేను మీతో అంటున్నాను** لا تثريب عليكم اليوم انتم الطلقاء **ఈ రోజు మీపై ఎలాంటి ఫిర్యాదూ (నిలదీత) లేదు. మీరంతా స్వతంత్రులు”** అని పలికారు. హజ్రత్ యూసుఫ్ (అ) గారి ఉదాహరణ ద్వారా ఆయన (స) చెప్పదలచిన అసలు విషయం ఏమిటంటే, మీలోని పగ, ద్వేషం, వైరం బంధుత్వ భావనను, సోదర భావనను నిర్జీవంగా చేసేసింది. కాని నేను మాత్రం మిమ్మల్ని ఇంతకు ముందు కూడా సోదరులుగానే చూశాను. ఇప్పుడూ సోదరులుగానే చూస్తున్నాను – ప్రపంచ చరిత్రలో ఒక బలిశాలి అయిన విజేత పరాజితుల పట్ల ఇలా సద్వ్యవహారం చేసిన ఉదాహరణ లభిస్తుందా?

## కదన రంగంలో కూడా దయార్ద్రత

ఇస్లాం సర్వసామాన్యంగా అవిశ్వాసులను హతమార్చమని ఆజ్ఞాపిస్తుంది –

అన్న భావన ఎల్లెడలా ప్రబలిపోయింది. కాని ఈ తలంపు సరైనది కాదు. 'జిహాద్' అంటే సాధన, కృషి, ప్రయత్నం, పాటుబడటం అని అసలు అర్థం. కాబట్టి ఈ రకమయిన జిహాద్ నోటితో కూడా చేయవచ్చు. కలముతో, డబ్బుతో కూడా చేయవచ్చు. ఈ సాధనకు ఆఖరి రూపమే యుద్ధం. కాని ఈ యుద్ధమైనా అవిశ్వాసులతో కాదు, దౌర్జన్యపరులతో మాత్రమే చేయబడుతుంది. ఒకవేళ ఏ ముస్లిమయినా దౌర్జన్యానికి దిగితే అతనితో కూడా జిహాద్ చేయబడుతుంది. ప్రవక్త సహచరుల హయాంలో కూడా ఇలాంటి దృష్టాంతాలు ఉన్నాయి. వారి కాలంలో ముస్లింలు ముస్లింలతో జిహాద్ చేశారు. ఎందుకంటే వారు, తమ ప్రత్యర్థులను దౌర్జన్యపరులుగా భావించారు. ఈ నేపథ్యంలో దివ్యఖుర్ఆన్ సూత్రప్రాయంగా తెలిపిన విషయమిది:

وَقَاتِلُوا فِي سَبِيلِ اللَّهِ الَّذِينَ يُقَاتِلُونَكُمْ وَلَا تَعْتَدُوا
إِنَّ اللَّهَ لَا يُحِبُّ الْمُعْتَدِينَ

**"మీతో పోరాడే వారితో మీరు కూడా దైవమార్గంలో పోరాడండి. కాని హద్దు మీరకండి. హద్దు మీరే వారిని అల్లాహ్ ఎంతమాత్రం ఇష్టపడడు."**
***(అల్ బఖరా-190)***

అంటే, ముస్లింలపై కయ్యానికి కాలుదువ్వే వారితో జిహాద్ చేయడానికి ఆనతి ప్రదానం చేయబడింది. అయితే యుద్ధం అనివార్యమైనప్పుడు కూడా ఆయన (స) కొన్ని నైతిక పరిమితులను విధించారు. వాటికి కట్టుబడి ఉండటం తప్పనిసరిగా ఖరారు చేశారు. ఆయన (స) ఈ విధంగా ఆజ్ఞాపించారు:

لا تقتلوا شيخا فانياً ولا طفلاً صغيراً ولا امرأة

"ఏ వృద్ధుణ్ణిగానీ, చిన్న పిల్లవాణ్ణిగానీ, స్త్రీని గానీ చంపకూడదు."
*(అబూదావూద్-కితాబుల్ జిహాద్, హదీసు నెం. 2614).*

ఒక సందర్భంలో ఆయన (స) ముస్లిం సేనాధిపతి అయిన హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి)కు సూచనలిస్తూ, **"స్త్రీలను, కార్మికులను వధించకూడదు"** **"لا تقتلن امراة ولا عسيفاً"** (అబూదావూద్ ..... హదీసు నెం. 2669) అన్నారు.

వేరొక సందర్భంలో, "ముస్లిమేతరుల ఆలయాల సేవకులను చంపకండి" لا تقتلوا أصحاب الصوامع అని ఉద్బోధించారు (సుననె కుబ్రా లిల్ బైహఖీ–హదీసు నెం. 17933). అంటే యుద్ధ సందర్భంగా ధార్మిక ప్రముఖుల, ధర్మబోధకుల జోలికి పోవద్దని చెప్పారన్నమాట. క్షతగాత్రుడై ఉన్న వ్యక్తిపై దాడి చేయటంగానీ, యుద్ధరంగం నుండి పరారవుతున్న వానిని వెంటాడటంగానీ చేయరాదని కూడా ఆయన (స) ఆదేశించారు. ఖైదీగా పట్టుబడిన వారిని వధించకూడదని చెప్పారు. తన ఇంటి తులుపులు మూసుకున్న వారిపై దాడి చేయటం ధర్మం కాదన్నారు:

لا تجهزن على جريح ولا يتبعن مدبر ولا يقتلن
اسير ولا من اغلق بابه فهو آمن ـ

> "గాయపడిన వారిపై దాడి చేయకండి. పారిపోతున్న వారిని వెంబడించకండి. ఖైదీని చంపకండి. తన ఇంటి ద్వారం మూసి ఉంచిన వానిని కూడా– (వీరంతా) సురక్షితులు." *(అబూదావూద్–కితాబుల్ జిహాద్, హదీసు నెం. 2677)*

ఎవరినయినా అగ్నికి ఆహుతి చేసి, శిక్షించడాన్ని కూడా ఆయన (స) నిషేధించారు. "لا ينبغي أن يعذب بالنار إلا رب النار" (అబూదావూద్ –కితాబుల్ జిహాద్, హదీసు నెం. 2677). గత్యంతరంలేని స్థితిలో తప్ప అగ్నితో కూడిన ఆయుధాలను ప్రయోగించరాదన్న సంకేతం ఇందులో ఉంది. అరబ్బులు పూర్వం శత్రు సైనికులపై విజయం సాధించినప్పుడు, ప్రత్యర్థి సైనికులను చంపటమేగాక, వారి శవాలను 'ముస్లా' చేసేవారు (అంటే శరీరావయవాలను ముక్కలు ముక్కలుగా నరికేసేవారు). ఇలా చేయరాదని ఆయన (స) ఆజ్ఞాపించారు: "نهى النبي صلى الله عليه وسلم من النهبى والمثلة" (బుఖారీ– కితాబుల్ మజాలిమ్, హదీసు నెం. 2342). శత్రువు చేతికి చిక్కినప్పుడు అతన్ని చిత్రవధకు గురి చేసి చంపే ఆచారం కూడా ఉండేది. ఈ విధంగా బంధించి, బాధించి చంపటాన్ని ఆయన (సఅసం) వారించారు: "نهى عن قتل الصبر" (అబూదావూద్ – కితాబుల్ జిహాద్, హదీసు నెం. 2689).

చెప్పవచ్చిందేమంటే మౌలికంగా దైవప్రవక్త (సఅసం) శాంతిభద్రతలను కోరుకునేవారు. సాధ్యమైనంతవరకు యుద్ధాన్ని నివారించేందుకు యత్నించేవారు.

ఒకవేళ ప్రత్యర్థుల తరఫున యుద్ధం చేయక తప్పని పరిస్థితి గనక సృష్టించబడితే అప్పుడు కూడా యుద్ధానికి సంబంధించిన కొన్ని నాగరికమయిన నియమ నిబంధనలను నిర్ధారించారు. ఆనాడు అరబ్బులలోనూ, తమ ఇరుగు పొరుగు రాజ్యాలలోనూ తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న అమానుష పద్ధతులను అంతమొందించారు.